# కిందకెళ్లిపోతోంది

## బయటికొచ్చిన పైలట్ ఆఖరి సందేశం



న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో కూలిన ఎయిరిండియా విమానానికి సంబంధించి దాని పైలట్ ఆడియో సందేశం ఒకటి బయటికొచ్చింది. కేవలం ఐదు సెకన్ల వ్యవధి ఉన్న ఆ మెసేజ్‌లో కెప్టెన్ సమిత్ సబ్రావల్ మాట్లాడుతూ 'మేడే.. మేడే.. మేడే.. నో పవర్.. నో థ్రస్ట్.. గోయింగ్ డౌన్(కిందకు వెళ్లి పోతోంది)' అని పేర్కొన్నారు. ఆ వెంటనే విమానం కూలిపోయింది.

**కూలడానికి ముందు ట్రిప్‌లో సాఫీగా ప్రయాణం**

ఎయిర్ ఇండియా డ్రీమ్‌లైనర్ విమానం గురువారం అహ్మదాబాద్‌లో కూలడానికి ముందు అందులో ఎలాంటి సమస్యలు కనిపించలేదని పౌరవిమానయాన శాఖ తెలిపింది. అంతకుముందే అది పారిస్ నుంచి ఢిల్లీకి, అక్కడి నుంచి అహ్మదాబాద్‌కు ప్రయాణించినట్టు పేర్కొంది. విమాన దుర్ఘటన తర్వాత తొలిసారి శనివారం మీడియా సమావేశం నిర్వహించిన పౌర విమానయాన శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. విమానం కూలిపోవడానికి ముందు పైలట్ 'మేడే' కాల్ చేశారని, వెంటనే అప్రమత్తమైన ఏటీసీ పైలట్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదని విమానయానశాఖ కార్యదర్శి సమీర్‌కుమార్ తెలిపారు. విమానం టేకాఫ్ అయిన నిమిషం తర్వాత రెండు కిలోమీటర్ల దూరంలోని మేఘని నగర్‌లో కూలిపోయినట్టు వివరించారు.

# ప్రాణాలను కాపాడే 11ఏ!

- ఇదే నంబర్ సీట్లో ప్రాణాలు దక్కించుకున్న థాయ్‌లాండ్ నటుడు
- 27 ఏండ్ల నాటి ఘటనను గుర్తు చేసుకున్న రువాంగ్సక్ లోయ్‌చుసక్



న్యూఢిల్లీ: విమానాల్లోని సీట్లలో 11ఏ ప్రాణ రక్షకిగా, పునర్జన్మను ఇచ్చేదిగా మారిందా? రెండు విమాన ప్రమాదాలను పరిశీలించినపుడు ఈ ఆసక్తికర ప్రశ్న ఉదయిస్తుంది. అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఎయిరిండియా ఏఐ-171 విమాన ప్రమాదంలో 11ఏ సీటులో కూర్చున్న విశ్వాస్ కుమార్ రమేశ్ సజీవంగా బయటపడ్డారు. ఈ వార్తను మీడియాలో చూసిన థాయ్ నటుడు, గాయకుడు రువాంగ్సక్ లోయ్‌చుసక్ (47) అవాక్కయ్యారు. 27 ఏండ్ల క్రితం 1998 డిసెంబరు 11న తనకు పునర్జన్మ లభించిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ రోజు ఆయన ప్రయాణించిన థాయ్ ఎయిర్‌వేస్ ఫ్లైట్ టీజీ261 కిందకు దిగే సమయంలో పట్టు తప్పి, చిత్తడి నేలలో కూరుకుపోయింది. దానిలోని 146 మందిలో 101 మంది మరణించారు. కానీ 11ఏ సీట్లో కూర్చున్న రువాంగ్సక్ సజీవంగా బయటపడ్డారు. నాటి ప్రమాదంపై ఆయన మాట్లాడుతూ... విశ్వాస్ కుమార్ రమేశ్ ఏఐ171 విమానంలోని 11ఏ సీట్లో కూర్చున్నట్లు, ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు తెలుసుకుని తనకు గగుర్పాటు కలిగిందని చెప్పారు. ''భారత దేశంలో జరిగిన విమాన ప్రమాదంలో సజీవంగా బయటపడిన వ్యక్తి నాలాగే 11ఏ సీట్లో కూర్చున్నారు'' అని ఆయన ఫేస్‌బుక్ పోస్ట్‌లో రాశారు. 1998లో తాను ప్రయాణించిన విమానం బోర్డింగ్ పాస్ తన వద్ద లేదని, వార్తా పత్రికలు తన సీటు నంబర్‌ను, తాను సురక్షితంగా బయటపడిన విషయాన్ని రాశాయని తెలిపారు. ఆయన ఈ సంఘటన గురించి, అనేక సంవత్సరాలపాటు తాను అనుభవించిన భయం గురించి చాలాసార్లు చెప్పారు. తనకు పునర్జన్మ లభించిందని చెప్పేవారు. ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించినవారి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన దాదాపు పదేండ్ల పాటు విమాన ప్రయాణాలు చేయలేదని కొన్ని మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి.

# ఊహించని మరణ శాసనం

- ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనలో 270కి చేరిన మృతుల సంఖ్య
- మృతుల్లో మెడికోలు, వారి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక చిరు వ్యాపారులు, రోగులు, బంధువులు ఉండొచ్చని అంచనా
- అనుకోని ఘోరంతో అనంత వాయువుల్లోకి వారి ప్రాణాలు
- దేశ ప్రజలను కంటతడి పెట్టిస్తున్న మృతుల దీన విషాద గాథలు





డీఎన్ఏ పరీక్ష కోసం వచ్చిన ఓ మృతుడి బంధువు ఆవేదన

అహ్మదాబాద్, జూన్ 14: అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతుల సంఖ్య మరింత పెరిగి 270కి చేరింది. ఎవరూ ఊహించని ఈ ప్రమాదంతో మృతుల కుటుంబాల్లో తీరని శోకం నెలకొంది. విమానంలోని ప్రయాణికులే కాకుండా బీజే మెడికల్ హాస్టల్ విద్యార్థులు నలుగురు, దాని సమీపంలోని కొందరు స్థానికులు ఈ ప్రమాదంలో మృత్యువాత పడటం అందరినీ కలిచి వేస్తున్నది. ఒక్కొక్కరి మరణ గాథ హృదయాలను మెలి పెడుతున్నది. మధ్యాహ్నం భోజన వేళ హాస్టల్‌కు వచ్చిన ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగిన నలుగురు మెడికోలు, రెసిడెంట్ డాక్టర్ల కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల తమ పనుల్లో నిమగ్నమైన అన్నెం పున్నెం ఎరుగని స్థానిక వ్యాపారులు, రోగులు అనుకోకుండా ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం ప్రతి ఒక్కరినీ కంట తడి పెట్టిస్తున్నది. విమానం కూలి కింద పడే క్రమంలో గాయపడి చికిత్స పొందుతున్న కొందరు శుక్ర, శనివారాల్లో మృతి చెందారని అధికారులు తెలిపారు. మరోవైపు విమానం తోక భాగంలో ఎయిర్ హోస్టెస్ మృతదేహాన్ని శనివారం గుర్తించారు. విమానంలోని ప్రయాణికులతో పాటు సుమారు 33 మంది స్థానికులు మరణించి ఉంటారని అంచనా వేస్తున్నారు.

**తొమ్మిది మృతదేహాల డీఎన్ఏ సరిపోలిక**

ఇప్పటివరకు అహ్మదాబాద్‌లోని సివిల్ దవాఖానకు 270 మృతదేహాలు వచ్చినట్టు అధికారులు తెలిపారు.ఇప్పటివరకు తొమ్మిది మృతదేహాల డీఎన్ఏలు సరిపోలాయని, దీంతో వారి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించామన్నారు. అలాగే 8 మృతదేహాల ముఖాలు చెక్కు చెదరకుండా ఉండటంతో వాటిని ఇప్పటికే బంధువులకు ఇచ్చేశామన్నారు.

**వదంతులు ఆపండి**

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో అనేక మంది వైద్యులు మరణించినట్టు జరుగుతున్న ప్రచారాన్ని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్, బీజే మెడికల్ కాలేజీ (బీజేఎంసీ) శనివారం ఖండించాయి. భోజనం చేస్తున్న నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు మాత్రమే మరణించారని, 20 మంది విద్యార్థులు గాయపడ్డారని, అందులో 11 మంది డిశ్చార్జి అయ్యారని తెలిపాయి. అలాగే అతుల్యం భవనంలో నివసిస్తున్న సూపర్ స్పెషాలిటీ వైద్యుల కుటుంబ సభ్యులు నలుగురు కూడా ఈ ప్రమాదంలో మరణించారన్నారు.

**దర్యాప్తునకు అత్యున్నత స్థాయి కమిటీ**

అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నతస్థాయి కమిటీని నియమించినట్టు కేంద్రం శనివారం తెలిపింది. బ్లాక్‌బాక్స్‌ను డీకోడ్ చేస్తే విమానం కూలడానికి ముందు ఏం జరిగిందనేది తెలుస్తుందని పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కఠిన భద్రతా ప్రమాణాలు, ప్రొటోకాల్‌ను అనుసరించినప్పటికీ ప్రమాదం జరిగిందని ఆవేదన చెందారు. హోంశాఖ కార్యదర్శి అధ్యక్షతన ఉన్నతస్థాయి క్రమశిక్షణ ప్యానెల్ సోమవారం సమావేశమవుతుందని పేర్కొన్నారు. అలాగే, బోయింగ్ 787 విమానాలను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించినట్టు చెప్పారు.

## అదే వారి ఆఖరి భోజనం

వారంతా రాబోయే కాలంలో కాబోయే డాక్టర్లు. ప్రజలకు సేవ చేసే వృత్తిలో భాగస్వాములు కాబోతున్నామన్న ఆ యువ వైద్యుల ఆశలు, ఆశయాలను ఛిద్రం చేస్తూ మృత్యువు హఠాత్తుగా విమాన రూపంలో కబళించింది. ఆనందంతో కబుర్లు చెప్పుకుంటూ బీజే మెడికల్ హాస్టల్‌లో గురువారం మధ్యాహ్న భోజనం చేస్తున్న వారిలో కొందరు అదే తమ ఆఖరి భోజనం అని తెలుసుకోలేకపోయారు. ఆకాశం నుంచి మృత్యువులా దూసుకొచ్చిన ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్ లైనర్ విమానం వారి భవనం పైకి దూసుకురావడంతో నలుగురు మెడికోలు, మరో నలుగురు వైద్యుల కుటుంబ సభ్యులు ఏం జరిగిందో తెలుసుకునే లోగానే వారి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

**కూతురి మృత దేహం కోసం...**

గుజరాత్‌లోని ఆనంద్ పట్టణానికి చెందిన సురేష్ మిస్త్రీ పరిస్థితి మరింత హృదయ విదారకం. 21 సంవత్సరాల తన కుమార్తె క్రీనా మిస్త్రీని విమాన ప్రమాదంలో ఆయన పోగొట్టుకున్నారు. ప్రభుత్వ దవాఖాన మార్చురీ వద్ద తన కుమార్తె మృతదేహం కోసం ఆయన ఎదురుచూస్తున్నారు. ఏడాది క్రితం కీనాకు లండన్ నుంచి వర్క్ పర్మిట్ వీసా వచ్చింది. ఇటీవలే ఆనంద్‌కు తిరిగి వచ్చిన క్రీనా చిన్న ప్రమాదం బారిన పడింది. డెంటల్ సర్జరీ చేసుకున్న తర్వాత లండన్‌కు డ్రీమ్‌లైనర్ విమానం ఎక్కి ప్రాణాలు కోల్పోయింది.

## ఎంటెక్ చదివేందుకు వెళ్తూ మృత్యువాత

అహ్మదాబాద్: భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో బ్రిటన్‌లో ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ చదువుకునేందుకు ఎయిర్ ఇండియా విమానం ఎక్కిన ఆ యువతి జీవితం అర్ధాంతరంగా ముగిసిపోయింది. సరకులు రవాణా చేసే ఆటో ట్రాలీ డ్రైవర్‌గా జీవితాన్ని గడుపుతున్న ఆ యువతి తండ్రి విదేశాలలో పై చదువులు పూర్తి చేసిన తర్వాత తమ కుమార్తె తమకు ఆర్థికంగా అండగా నిలబడుతుందని గంపెడాశతో అప్పులు చేసి మరీ కుమార్తెను విమానం ఎక్కించాడు. గుజరాత్‌లోని హిమత్‌నగర్‌కు చెందిన పాయల్ ఖతీక్ గురువారం ఉదయం మొట్టమొదటిసారి దేశం విడిచి వెళుతున్నానన్న ఉద్వేగంతో అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానం ఎక్కింది. అయితే కొన్ని క్షణాల్లోనే కూలిపోయిందన్న దుర్వార్తను టీవీలలో చూసి ఆమె కుటుంబం గుండె పగిలింది. మాస్టర్స్ డిగ్రీ లండన్‌లో చదువుకోవాలని తన కూతురు కోరుకోవడంతో ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా అప్పు చేసి మరీ ఆమెను లండన్ పంపించాలని నిర్ణయించుకున్నామని పాయల్ తండ్రి సురేష్ ఖతీక్ ఐఏఎన్ఎస్ వార్తాసంస్థకు తెలిపారు. తమ కుటుంబంలో విదేశాలలో చదువుకోవడానికి అవకాశం వచ్చిన తొలి వ్యక్తి పాయల్ అని ఆయన తెలిపారు.

## మధ్యప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్

**నలుగురు మావోయిస్టుల మృతి**

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలతో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మరణించినట్లు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ చెప్పారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని తెలిపారు. మావోయిస్టుల కోసం గాలింపు కొనసాగుతున్నదని తెలిపారు.

**ఒడిశాలో సీఆర్‌పీఎఫ్ అధికారి మృతి**

ఒడిశా-జార్ఖండ్ సరిహద్దుల్లో శనివారం మావోయిస్టుల కోసం గాలింపు జరుపుతున్న సమయంలో ఐఈడీ పేలడంతో సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ సత్యబన్ కుమార్ సింగ్ (34) మరణించారు. ఆయన ఉత్తరప్రదేశ్‌లోని ఖుషీ నగర్‌కు చెందినవారు. ఓ స్టోన్ క్వారీ నుంచి మావోయిస్టులు దొంగిలించిన పేలుడు పదార్థాల కోసం అడవిలో గాలింపు జరుపుతుండగా ఈ దుర్ఘటన జరిగింది.

## శుభాన్షు శుక్లా రోదసి యాత్ర ఈనెల 19న

**కొత్త తేదీని వెల్లడించిన ఇస్రో**

న్యూఢిల్లీ: సాంకేతిక సమస్యతో వాయిదా పడిన స్పేస్ ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌక ప్రయోగానికి సంబంధించి కొత్త తేదీని ఇస్రో తాజాగా ప్రకటించింది. ఈనెల 19న 'యాక్సియం-4' మిషన్ ప్రయోగం చేపడుతున్నట్టు వెల్లడించింది. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ వద్ద నుంచి చేపడుతున్న ఈ మిషన్.. సాంకేతిక కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడింది. ఈ మిషన్ ద్వారా..శుభాన్షు శుక్లా సహా పోలండ్, హంగేరీ, అమెరికాకు చెందిన మొత్తం నలుగురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకొని కీలక ప్రయోగాలు చేయాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం రాకెట్ ప్రయోగాన్ని 29నే చేపట్టాల్సి ఉంది. అయితే అది జూన్ 8కి, ఆ తరువాత 11కి వాయిదా పడింది.

## భారత్ మ్యాప్ పోస్టింగ్‌పై ఐడీఎఫ్ క్షమాపణ

టెల్ అవీవ్: జమ్ముకశ్మీర్ ప్రాంతాన్ని పాకిస్థాన్‌లో భాగంగా చూపిస్తున్నట్టున్న భారత దేశ మ్యాప్‌ను ఎక్స్‌లో పోస్ట్ చేసినందుకు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) శనివారం క్షమాపణ చెప్పింది. భారత్, పాక్ సరిహద్దులను కచ్చితంగా చూపించడంలో ఈ మ్యాప్ విఫలమైనట్లు అంగీకరించింది. అయితే, ఈ మ్యాపు ఈ ప్రాంతానికి సంబంధించిన చిత్రం మాత్రమేనని స్పష్టం చేసింది. ఐడీఎఫ్ ఈ మ్యాప్‌ను పోస్ట్ చేసిన తర్వాత భారతీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టులు చేశారు.

## విస్తరిస్తున్న కరోనా

**7 వేలు దాటిన యాక్టివ్ కేసులు**

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా క్రియాశీలక కొవిడ్-19 కేసుల సంఖ్య 7,400కు చేరినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం తెలిపింది. 24 గంటల్లో కొత్తగా 269 కేసులు నమోదైనట్లు, తొమ్మిది మంది మరణించినట్లు వెల్లడించింది. కర్ణాటకలో ఒక రోజులోనే 132 క్రియాశీలక కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో నలుగురు, కేరళలో ముగ్గురు, రాజస్థాన్, తమిళనాడులలో ఒక్కొక్కరు మరణించారు.

దేశంలో మొత్తం యాక్టివ్ కరోనా కేసులు **7,400**

కొత్తగా నమోదైన కేసులు **269**

ఈ ఏడాది ఇప్పటివరకు మరణాలు-**87**

తాజాగా నమోదైన మరణాలు-**9**

## 'డ్రీమ్ లైనర్' తనిఖీలు ప్రారంభం

న్యూఢిల్లీ, జూన్ 14: ఎయిరిండియా వద్ద ఉన్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో విస్తృత భద్రతా తనిఖీలు నిర్వహించాలన్న పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ఆదేశాల మేరకు తనిఖీలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది డ్రీమ్‌లైనర్ విమానాల్లో భద్రతా తనిఖీలు పూర్తి చేశామని, మిగిలిన 24 విమానాల్లో త్వరలోనే పూర్తి చేస్తామని ఎయిర్ ఇండియా శనివారం తెలిపింది. ఈ తనిఖీల్లో కొన్నింటికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొంది. విమానాలు ఆలస్యం కావచ్చునని, సమాచారాన్ని ప్రయాణికులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని వెల్లడించింది.

## రాజ్యాంగం సజీవ పరిణామ పత్రం

**సీజేఐ గవాయ్**

న్యూఢిల్లీ, జూన్ 14: వివిధ పరిస్థితులకు అనుగుణంగా మార్పులను స్వీకరించే సజీవ, సహజ, పరిణామ పత్రంగా భారతీయ రాజ్యాంగాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ అభివర్ణించారు. ఎడిన్‌బర్గ్ లా స్కూలులో పరిణామ పత్రంగా రాజ్యాంగం అనే అంశంపై సీజేఐ ప్రసంగిస్తూ మారుతున్న కాలంలో వచ్చిన సవాళ్లను ఎదుర్కొనడానికి గడచిన 75 ఏండ్లలో అనేక సవరణలను భారత రాజ్యాంగం వీక్షించిందన్నారు. వివిధ సందర్భాలలో రాజ్యాంగంపై సుప్రీంకోర్టు ఇచ్చే వివరణ కారణంగా ఉత్పన్నమయ్యే ప్రశ్నలకు పార్లమెంట్ సకాలంలో స్పందించి పార్లమెంట్‌లో రాజ్యాంగానికి సవరణలు తీసుకురావడం ద్వారా సమాధానాలు ఇచ్చిందని తెలిపారు. కొత్త తరాలకు చెందిన మార్పులకు అనుగుణంగా రాజ్యాంగంలో మార్పులు అవసరమవుతాయని చెప్పారు.

## అక్రమ వలసదారులపై చర్యలకు సవరణలు

- వ్యవసాయ, హోటల్ కార్మికులకు మినహాయింపు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హామీ

వాషింగ్టన్: అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కు తగ్గారు. మంచివారైన, చాలా కాలం నుంచి తమ వద్ద పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ దూకుడు విధానం తమ నుంచి దూరం చేస్తున్నదని రైతులు, హోటల్, లీజర్ బిజినెస్ వర్గాలు చెప్పినట్లు ఈ నెల 12న ట్రూత్ సోషల్ పోస్ట్‌లో ఆయన తెలిపారు. ఈ ఉద్యోగాల్లో వేరొకరిని నియమించడం దాదాపు అసాధ్యమని అంటున్నారని చెప్పారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ అమలు చేసిన అత్యంత అవివేకమైన ఓపెన్ బోర్డర్ పాలసీ వల్ల దేశంలోకి నేరగాళ్లు రావడానికి అవకాశం కలిగిందన్నారు. ఈ విధానంలో మార్పులు రాబోతున్నాయని చెప్పారు. లాస్ ఏంజెలెస్‌లో నిరసనలపై ట్రంప్ స్పందిస్తూ, వలసదారులు ఎక్కువగా పని చేస్తున్న ఈ ప్రాంతంలో వ్యాపారాలకు ఆటంకం కలగకుండా కార్యనిర్వాహక ఆదేశాన్ని జారీ చేస్తానని చెప్పారు.

# ఫేక్ గ్రీన్‌కార్డ్ అప్లికేషన్లపై ఉక్కుపాదం

- ఈబీ-1ఏ విభాగంపై అధికారుల పునఃపరిశీలన
- గతంలో ఆమోదం పొందినా ఆందోళన తప్పదు
- యూఎస్ ఇమిగ్రేషన్ అటార్నీ రాహుల్ రెడ్డి హెచ్చరిక




వాషింగ్టన్: మోసపూరిత గ్రీన్ కార్డ్ దరఖాస్తులపై అమెరికా ప్రభుత్వం విరుచుకుపడుతున్నది. మరీ ముఖ్యంగా 'అసాధారణ సామర్థ్యం' విభాగంలోని ఈబీ-1ఏపై దృష్టి పెట్టింది. సైన్స్, బిజినెస్, అథ్లెటిక్స్, ఆర్ట్స్ వంటి రంగాల్లో అసాధారణ ప్రతిభా పాటవాలు గలవారి కోసం ఈబీ-1ఏ వీసాను అమెరికా ఇస్తుంది. అత్యున్నత స్థాయి నైపుణ్యంగల వలసదారులకు ఇది చాలా కాలం నుంచి ఆకర్షణీయమైన మార్గంగా ఉంది. ఇమిగ్రేషన్ అటార్నీ రాహుల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఈబీ-1ఏ పిటిషన్లలో చాలా వరకు రీ-ఇన్వెస్టిగేషన్‌ను ఎదుర్కొంటున్నాయి. వీటిలో అత్యధిక దరఖాస్తులు భారతీయులవే. చాలా దరఖాస్తులను అధికారులే రద్దు చేస్తుండటం పెరుగుతున్నది. రెడ్డి తన యూట్యూబ్ చానల్‌లో పెట్టిన వీడియోలో తెలిపిన వివరాల ప్రకారం, కొందరు దరఖాస్తుదారులు నాసిరకం జర్నల్స్‌లో వ్యాసాలను ప్రచురిస్తున్నారు. సమన్వయంతో కూడిన సహ రచన ద్వారా బూటకపు ప్రస్తావనలను, పురస్కారాలను సృష్టిస్తున్నారు. ఇందుకోసం కొన్ని ఏజెన్సీలకు డబ్బులు చెల్లిస్తున్నారు, ప్యాకేజీలు కుదుర్చుకుంటున్నారు. ఇటువంటి వారిని పట్టుకునేందుకు, గతంలో ఆమోదం పొందిన ఈబీ-1ఏ పిటిషన్లను కూడా యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ మరోసారి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నది. దాదాపు 200 మంది కలిసి ఓ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారని, వారు ఒకరి క్రెడెన్షియల్స్‌ను మరొకరు బలపరచుకుంటున్నారని, డబ్బు చెల్లిస్తే, ఇతరులకు కూడా ఇలా చేసిపెడతామని చెప్తున్నారని ఓ సోషల్ మీడియా యూజర్ చెప్పినట్లు రాహుల్ రెడ్డి తెలిపారు. ఈబీ-1ఏ కేటగిరిని ప్రక్షాళన చేసి, ఈ పథకం సమగ్రతను పునరుద్ధరించడం కోసం యూఎస్‌సీఐఎస్ ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ అంశాలు బయటపడినట్లు చెప్పారు.

**స్వాగతిస్తున్న నిజాయితీపరులు**

యూఎస్‌సీఐఎస్ చర్యలను నిజాయితీగా చట్టబద్ధ మార్గాల్లో ఈబీ-1ఏ కోసం చాలా కాలం నుంచి ఎదురు చూస్తున్న భారతీయులు స్వాగతిస్తున్నారని తెలిపారు. ఈ ప్రక్రియలో నిజాయితీ, సమగ్రత వస్తాయని ఆశిస్తున్నారని చెప్పారు.

**పాతవాటిని కూడా రద్దు చేసే దిశగా...**


యూఎస్‌సీఐఎస్ కొత్త దరఖాస్తులను తిరస్కరించడంతో పాటు, గతంలో ఆమోదించిన ఐ-140 పిటిషన్లు, గ్రీన్ కార్డులను తిరిగి పరిశీలించి, రద్దు చేయడం ప్రారంభించవచ్చునని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కేస్ బిల్డర్లతో జాగ్రత్త**

థామస్ వీ అల్లెన్ లా ఆఫీస్ ఇచ్చిన లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో, ఈబీ-1ఏ కేస్ బిల్డర్‌కు డబ్బు చెల్లించే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని హెచ్చరించింది. నియంత్రణ సంస్థల నిబంధనలకు అనుగుణంగా తగిన సాక్ష్యాధారాలను సృష్టించేందుకు కేస్ బిల్డర్లు పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేస్తారని, ఇటువంటి షార్ట్‌కట్స్ వల్ల దీర్ఘకాలంలో నష్టం తప్పదని హెచ్చరించింది. దరఖాస్తుకు ఆమోదం లభించినా సురక్షితం కాదంది.

# రెండు సార్లు రద్దు చేసినా..

- మాజీ సీఎం రూపానీని వెంటాడిన దురదృష్టం
- మూడో సారి విమాన బుకింగ్ ప్రయాణంలో మృతి



అహ్మదాబాద్, జూన్ 14: అహ్మదాబాద్‌లో జూన్ 12న(గురువారం) జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన 241 మందిలో ఒకరైన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ఆ రోజు ఆ విమానంలో ప్రయాణించాలని ముందుగా భావించలేదు. మే 19న లండన్ బయల్దేరేందుకు మొదట ఆయన ఏఐ171 విమానం టికెట్ బుక్ చేశారు. జూన్ 25న తిరుగు ప్రయాణం టికెట్ కూడా బుక్ చేశారు. అయితే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకుని ఆ టికెట్లు రద్దు చేసి జూన్ 5న లండన్ బయల్దేరేందుకు టికెట్ బుక్ చేశారు. ఆ రెండవ టికెట్ కూడా క్యాన్సిల్ చేసి జూన్ 12న ఏఐ 171 విమానంలో ప్రయాణించేందుకు సీట్ నంబర్ 2డీ టికెట్ బుక్ చేశారు. టేకాఫ్ అయిన 32 సెకండ్లకే ఆయన బయల్దేరిన విమానం కూలిపోయి ఆయనతోసహా 241 మంది ప్రయాణికులు అసువులు బాశారు.

**సంజయ్ గాంధీ నుంచి రూపానీ వరకు పలువురు రాజకీయ నాయకులు..**

అహ్మదాబాద్‌లో గురువారం(జూన్ 12) జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో 68 ఏళ్ల గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీతోసహా 241 మంది ప్రయాణికులు మరణించారు. గతంలో కూడా అనేక విమాన ప్రమాదాలు పలువురు రాజకీయ ప్రముఖులను బలి తీసుకున్నాయి. వారిలో కాంగ్రెస్ నేతలు సంజయ్ గాంధీ, మాధవ్‌రావు సింధియా, వైఎస్ రాజశేఖర్ రెడ్డితో పాటు లోక్‌సభ మాజీ స్పీకర్, టీడీపీ నేత జీఎంసీ బాలయోగి, పంజాబ్ మాజీ సీఎం గుర్నామ్ సింగ్ తదితరులు ఉన్నారు. 2011లో అప్పటి అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి డోర్జీ ఖండూ హెలికాప్టర్ కూలి మరణించారు. 2005 మార్చి 31న పారిశ్రామికవేత్త, హర్యానా విద్యుత్ మంత్రి ఓపీ జిందాల్, మాజీ కేంద్ర మంత్రి సురేందర్ సింగ్(మాజీ రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ కుమారుడు) ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఉత్తర్ ప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌లో కూలిపోయి వారిద్దరూ మరణించారు.

## న్యాయం కోసం టీ మరుగుతూనే ఉంటుంది!

- *వరకట్న వేధింపుల కేసుపై సంకెళ్లతో భర్త నిరసన*
- *అత్తగారి ఇంటి ఎదుట '498ఏ టీ కేఫ్' ఏర్పాటు*
- *చట్టం దుర్వినియోగం గురించి ప్రజలకు వివరణ!*



*జైపూర్: మధ్య ప్రదేశ్‌లోని అథన గ్రామస్థుడు కృష్ణ కుమార్ ధాకడ్ (33) వినూత్న నిరసన చేపట్టారు. తన భార్య చట్టాన్ని దుర్వినియోగపరచి, తనను అక్రమంగా వరకట్న వేధింపుల కేసులో ఇరికించిందని ఆరోపిస్తూ, ఆమె తల్లిదండ్రుల ఇంటి ముందే '498ఏ టీ కేఫ్'ను తెరిచారు. దానిలో తన పెండ్లి నాటి తలపాగా, పూలమాలలను వేలాడదీశారు. 'న్యాయం జరిగే వరకు టీ మరుగుతూనే ఉంటుంది', 'టీ తాగుతూ మాట్లాడుకుందాం : సెక్షన్ 125 కోసం మనం ఎంత చెల్లించాలి?' అనే నినాదాలను తన టీ స్టాల్‌లో రాశారు. అంతేకాకుండా, తన చేతులకు సంకెళ్లు వేసుకుని, టీని తయారు చేసి, వినియోగదారులకు అందిస్తున్నారు. టీ కోసం వచ్చేవారంతా ఆయన గురించి ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. తన టీ స్టాల్‌కు వచ్చేవారితో కృష్ణ మాట్లాడుతూ.. రాజస్థాన్‌లోని అంటాహ్‌కు చెందిన యువతితో తనకు 2018లో వివాహం జరిగిందని చెప్పారు. 2019లో తామిద్దరమూ కలిసి తేనెటీగల పెంపకం వ్యాపారాన్ని ప్రారంభించామన్నారు. 2022లో తమ వైవాహిక జీవితంలో ఇబ్బందులు వచ్చాయని, తన భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని తెలిపారు. మానసిక క్రూరత్వం, వరకట్న వేధింపుల ఆరోపణలతో తన భార్య తనపై కేసు పెట్టిందన్నారు. విడాకులకు అంగీకరించాలంటే రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసిందన్నారు. తమ ఉమ్మడి ఆస్తిని కూడా ఆమె తీసుకుందని చెప్పారు.*



## ఆవిష్కరణకు ముందే పగిలిన ఫలకం

***ప్రియాంక గాంధీకి చేదు అనుభవం***

*వయనాడ్: కేరళలోని వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాకు శనివారం చేదు అనుభవం ఎదురైంది. ఆమె పయ్యంపల్లి, మనంతవాడిలో పురపాలక సంఘ భవనానికి శంకుస్థాపన చేయడానికి వచ్చినప్పుడు ఇది జరిగింది. ఈ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన వేదికపై ఉన్న ఓ నామ ఫలకం (నేమ్ ప్లేట్)ను ఆమె ఆవిష్కరించాల్సి ఉంది. కానీ ఆవిష్కరించడానికి ముందే అది హఠాత్తుగా కింద పడిపోయి పగిలిపోయింది. దీంతో ఆమె అవాక్కయ్యారు. ఈ ఘటన పట్ల ఆమె దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది.*



## బ్రిడ్జిల బోల్ట్‌లు చేత్తో తీసేయొచ్చు!

- *బీహార్‌లో వంతెనల నిర్మాణంపై నెటిజన్ల విమర్శలు*
- *పాట్నాలో పిల్లల చర్య నేపథ్యంలో విస్తృత చర్చ*

*పాట్నా: బీజేపీ-జనతాదళ్ యునైటెడ్ పాలిత బీహార్‌లో వంతెనల నాణ్యతపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన ఓ బ్రిడ్జి ప్రారంభించి రెండు రోజులు కాకముందే దాని నట్లు, బోల్టులను కొందరు పిల్లలు చేత్తో తీసి పడేశారు. ఈ ఘటన ఇటీవల పాట్నాలో జరిగింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో వంతెనల భద్రతపై పెద్ద చర్చే మొదలైంది. నెటిజన్లు ఈ విషయమై తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర భవన నిర్మాణ శాఖ పనితీరును ఈ ఘటన వెలుగులోకి తెచ్చిందని ఒకరు ఘాటుగా స్పందించారు. ఆ పిల్లలు కేవలం చేతివేళ్లతోనే వాటిని తొలగించడం నిర్మాణంలో అద్భుతం అంటూ మరొకరు వ్యంగ్యంగా తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. బీహార్‌లో నిరుడు నెలల వ్యవధిలోనే సుమారు 15 వంతెనలు కూలిపోయాయి. ఈ ఘటనలతో వంతెనల నిర్మాణం, వివిధ శాఖల పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి.*